క్లుప్తంగా

ఎస్‌ఐకి సన్మానం



శాంతినగర్: మండల ఎస్‌ఐగా ఇటీవల బాధ్యతలు చేపట్టిన బి.నరేష్‌ను శుక్రవారం బీజేపీ నాయకులు మర్యాద పూర్వకంగా కలిసి శాలువాతో సన్మానించారు. అలాగే తనగల, వెంకట్రామనగర్‌కు చెందిన నాయకులు ఎస్‌ఐని కలిశారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు మధుసూదన్‌గౌడ్, రామకృష్ణనాయుడు, బోయ వెంకటేశ్వర్లు, రాజశేఖర్‌గౌడ్, అయ్యారాజు, శేఖర్, రమేష్, వీరేష్, వెంకటయ్య, తిప్పన్న పాల్గొన్నారు.

దరఖాస్తు చేసుకోవాలి

రాజోళి: ఉపాధి హామీ పథకంలో పండ్ల తోటల పెంపకానికి రైతులు దరఖాస్తు చేసుకోవాలని ఎంపీడీఓ గోవిందురావు శుక్రవారం ప్రకటనలో తెలిపారు. ఐదెకరాలలోపు భూమి ఉన్న రైతులు పట్టాదారు పాస్‌పుస్తకం, ఆధార్, ఉపాధి హామీ జాబ్‌కార్డుతో పంచాయతీ కార్యదర్శులను సంప్రదించాలని సూచించారు. దరఖాస్తుదారుల పొలంలో బోరుబావి, విద్యుత్ సౌకర్యం తప్పనిసరిగా ఉండాలని తెలిపారు. మరిన్ని వివరాల కోసం ఎంపీడీఓ, వ్యవసాయ కార్యాలయాల్లో సంప్రదించాలని కోరారు.

తహసీల్దార్‌కు అభినందన



ఎర్రవల్లిచౌరస్తా: పదోన్నతి పొందిన తహసీల్దార్ సుబ్రహ్మణ్యంను శుక్రవారం ఇటిక్యాల మండల నాయకులు శాలువాతో సన్మానించి అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో శ్రీధర్‌రెడ్డి, కొండేరు శేషన్‌గౌడ్, పోతరాజు సోమనాద్రి, బండి శ్రీకాంత్, వీరబాబు, మద్దిలేటి, గట్టు బాబు పాల్గొన్నారు.

పౌష్టికాహారం తీసుకోవాలి

మల్దకల్: గర్భిణులు పోషకాలు కలిగిన ఆహారం తీసుకోవాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ నాగరాణి సూచించారు. మండల కేంద్రంలోని అంగన్‌వాడీ కేంద్రాలను శుక్రవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఎత్తు, బరువు తక్కువగా ఉన్న చిన్నారుల ఆరోగ్యంపై జాగ్రత్తలు తీసుకోవాలని అంగన్‌వాడీ టీచర్లకు సూచించారు. గర్భిణులు, బాలింతలకు పౌష్టికాహారం సక్రమంగా పంపిణీ చేయాలన్నారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.

ఆర్టీసీ డీఎంకు వినతి

గట్టు: విద్యార్థుల కోసం ప్రత్యేక బస్సులను నడపాలని కోరుతూ తీన్మార్ మల్లన్న టీం జిల్లా కన్వీనర్ కొమ్ముల ప్రవీణ్ శుక్రవారం ఆర్టీసీ గద్వాల డిపో మేనేజర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బల్గెర నుంచి విద్యార్థులు అయిజకు వెళ్లి చదువుకుంటున్నారని, కళాశాల సమయానికి బస్సు లేకపోవడంతో ప్రైవేట్ వాహనాలను ఆశ్రయిస్తున్నట్లు తెలిపారు. బల్గెర నుంచి అయిజకు విద్యార్థుల కోసం బస్సు నడపాలని కోరారు. అదేవిధంగా గట్టు నుంచి గద్వాలకు రాకపోకలు సాగించే విద్యార్థులకు బస్సు పాస్‌లను జారీ చేయాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో బండారి డేవిడ్ పాల్గొన్నారు.

ఆటోలో ప్రసవం : తల్లీబిడ్డ క్షేమం

గద్వాల క్రైం: పురిటినొప్పులతో బాధపడుతున్న గర్భిణిని ఆటోలో ఆస్పత్రికి తీసుకెళ్తుండగా, మార్గమధ్యంలోనే ప్రసవించిన ఘటన శుక్రవారం జిల్లా కేంద్రంలో చోటుచేసుకుంది. స్థానికుల కథనం మేరకు.. కేటీదొడ్డి మండలం ఉమిత్యాలతండాకు చెందిన చిరంజీవి నాయక్ భార్య అరుణకు పురిటినొప్పులు రావడంతో కుటుంబ సభ్యులు ఆటోలో జిల్లా ప్రభుత్వాస్పత్రికి తీసుకొస్తుండగా, పట్టణ శివారులో పురిటినొప్పులు అధికమై బిడ్డకు జన్మనిచ్చింది. అనంతరం జిల్లా ఆస్పత్రికి తరలించగా, తల్లీబిడ్డ ఆరోగ్యంగా ఉన్నారని వైద్యులు తెలిపారు.

మంత్రిని కలిసిన ఏఈఓలు



గద్వాల రూరల్: ఏఈఓలను రెగ్యులరైజ్ చేయాలని కోరుతూ శుక్రవారం జిల్లా కేంద్రంలో వ్యవసాయశాఖ మంత్రి నిరంజన్‌రెడ్డికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఏఈఓలు ఎదుర్కొంటున్న సమస్యలను మంత్రి దృష్టికి తీసుకొచ్చారు.

రేపు విశ్వరూప సభ

గద్వాల రూరల్: ఎస్సీ వర్గీకరణ బిల్లును పార్లమెంట్‌లో పెట్టి చట్టబద్ధత కల్పించాలని డిమాండ్ చేస్తూ ఈనెల 30న జడ్చర్లలో మాదిగల విశ్వరూప సభ నిర్వహించనున్నట్లు ఎమ్మార్పీఎస్ జిల్లా కన్వీనర్ పోగుల రాజేష్ తెలిపారు. ధరూరులో శుక్రవారం ఎమ్మార్పీఎస్ ముఖ్యకార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణ ఆధ్వర్యంలో నిర్వహించనున్న మాదిగల విశ్వరూప సభకు అధిక సంఖ్యలో తరలివచ్చి విజయవంతం చేయాలని కోరారు.

భూసారం తెలుసుకునేదెలా?

- జాడలేని మినీ భూసార పరీక్ష కేంద్రాలు
- 2018లో క్లస్టర్‌కి ఒకటి చొప్పున మంజూరు
- పలు కారణాలతో కేంద్రాల ఏర్పాటులో జాప్యం
- ఇబ్బందులు పడుతున్న అన్నదాతలు



కొండేరులో ఎర్ర తెగులు సోకిన పత్తిపంటను పరిశీలిస్తున్న అధికారులు (ఫైల్)



షేక్‌పల్లిలో భూసార పరీక్ష కోసం మట్టిని తీస్తున్న రైతులు

ఎర్రవల్లిచౌరస్తా: భూసార పరీక్షలపై రైతులకు సరైన అవగాహన లేకపోవడంతో పంటలకు అవసరం లేని ఎరువులు, క్రిమిసంహారక మందులను వినియోగిస్తున్నారు. దీనివల్ల రైతులు ఆర్థికంగా నష్టపోవడమేగాక ఆశించిన స్థాయిలో దిగుబడులు సాధించలేకపోతున్నారు. పంట మార్పిడి విధానం పాటించకపోవడం, రసాయన ఎరువుల వాడకం అధికం కావడంతో భూసారం క్రమంగా తగ్గుతూ వస్తోంది. భూసార పరీక్షల ఆధారంగా పంటలను సాగు చేసి రైతులకు ఎంతో మేలు చేకూరుతోంది. ఉమ్మడి జిల్లాలో ఒకే భూసార పరీక్ష కేంద్రం ఉండడంతో మట్టి నమూనాలను అధికారులు అక్కడికి పంపేవారు. పరీక్ష కేంద్రం నుంచి రిపోర్టు అందేందుకు చాలా సమయం పడుతుండడంతో భూసార పరీక్షలపై రైతులు ఆసక్తి చూపడంలేదు. విషయాన్ని గుర్తించిన ప్రభుత్వం.. ప్రతి క్లస్టర్‌లో ఒక మినీ భూసార పరీక్ష కేంద్రం ఏర్పాటు చేయాలని నిర్ణయించింది. ఈ మేరకు 2018లో వ్యవసాయాధికారులకు ఆదేశాలు జారీ చేసింది. ఇందుకు సంబంధించిన కిట్లను కూడా ఆయా క్లస్టర్లకు ప్రభుత్వం సమకూర్చింది. కానీ గదుల కొరత, విద్యుత్ తదితర సమస్యల కారణంగా కొన్ని క్లస్టర్లలో ఏర్పాటు చేయలేదు. మరికొన్ని క్లస్టర్లలో ఏర్పాటు చేసినా కొద్ది రోజులు మాత్రమే పని చేశాయి. ప్రస్తుతం అన్ని క్లస్టర్లలోని కిట్లన్నీ నిరుపయోగంగా మారాయి. భూసార పరీక్ష కేంద్రాలు అందుబాటులో లేకపోవడంతో రైతులు ఇబ్బందులకు గురవుతున్నారు.

మండలాల వారీగా క్లస్టర్ల వివరాలు..

మండలం	క్లస్టర్లు
ఇటిక్యాల	12
మానవపాడు	7
అలంపూర్	5
ఉండవెల్లి	7
రాజోళి	6
వడ్డేపల్లి	5
అయిజ	11

పైలెట్ గ్రామాల ఎంపిక..

సేంద్రియ సాగు చేపట్టాలంటే భూసార పరీక్షలు తప్పనిసరి. అలంపూర్ నియోజకవర్గంలో మొత్తం 53 క్లస్టర్లు ఉండగా.. ప్రభుత్వం భూసార పరీక్షల కోసం పైలెట్ ప్రాజెక్టుగా 7 మండలాల నుంచి ఒక్కో గ్రామాన్ని ఎంపిక చేసింది. ఆయా గ్రామాల్లో రైతుల పొలాల్లో మట్టి నమూనాలను సేకరించి ఫలితాల నివేదికలను అందజేయాలని వ్యవసాయాధికారులకు ఆదేశాలు జారీ చేసింది. అయితే మినీ భూసార పరీక్ష కేంద్రాలు వినియోగంలో లేకపోవడంతో మట్టి నమూనాలను సమీపంలోని ల్యాబరేటరీకి పంపించి ఫలితాలను రైతులకు అందజేశారు.

భూసార పరీక్షలతో కలిగే లాభాలు..

భూసార పరీక్షలు చేయడం వల్ల పొలం ఏ పంటకు అనుకూలంగా ఉందో తెలుస్తుంది. అదేవిధగా వేసిన పంటలకు ఏయే ఎరువులను ఎంత మోతాదులో వాడాలో అవగాహన వస్తుంది. పంటలకు అనవసరమైన ఎరువులను వాడి ఆర్థికంగా నష్టపోకుండా ఉండవచ్చు. ముఖ్యంగా రైతులు పంట ఖర్చులను తగ్గించుకోవడంతోపాటు భూసారాన్ని కూడా అధికంగా పెంచుకోవచ్చు. భూసార పరీక్షలతో రైతులు ఆర్థికంగా నష్టపోకుండా అధిక దిగుబడులు సాధించే అవకాశం ఉంటుంది. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి మినీ భూసార పరీక్ష కేంద్రాల ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు.

ఇబ్బందులు తప్పడంలేదు..



మండల కేంద్రాల్లో భూసార పరీక్ష కేంద్రాలు లేకపోవడం వల్ల తీవ్ర ఇబ్బందులు పడుతున్నాం. పొలంలోని మట్టిని సేకరించి 100 కిలోమీటర్ల దూరంలో ఉన్న జడ్చర్ల ల్యాబ్‌కు పంపిస్తున్నాం. అక్కడి నుంచి రిపోర్టు రావడానికి సమయం పడుతుంది. ఒక్కోసారి రిపోర్టులు కూడా సక్రమంగా రావడంలేదు. దీనివల్ల చాలా మంది రైతులు భూసార పరీక్షలు చేసుకోవడం మానేశారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి ప్రతి క్లస్టర్‌లో భూసార పరీక్ష కేంద్రాన్ని ఏర్పాటు చేయాలి. – లక్ష్మన్న, రైతు, సోనసూలు

రైతువేదికల్లో ఏర్పాటుకు చర్యలు



రైతులు భూసార పరీక్షలను మూడేళ్లకోసారి తప్పకుండా చేయించాలి. ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలోని జడ్చర్లలో మాత్రమే భూసార పరీక్ష కేంద్రం ఉంది. ప్రభుత్వం మినీ భూసార పరీక్ష కేంద్రాలను మంజూరు చేసినా.. గదులు, విద్యుత్ వంటి సమస్యల కారణంగా సెంటర్లను ఏర్పాటు చేయలేకపోయాం. ప్రతి క్లస్టర్‌లో ఏర్పాటు చేసిన రైతువేదికల్లో భూసార పరీక్ష కేంద్రాల ఏర్పాటుకు చర్యలు తీసుకుంటాం. – సక్రియానాయక్, ఏడీఏ, అలంపూర్

ఇళ్ల మధ్య నీటి నిల్వలు ఉండొద్దు



డ్రైనేజీని పరిశీలిస్తున్న వైద్య సిబ్బంది

రాజోళి: ఇళ్ల మధ్య నీటి నిల్వలు ఉండకుండా జాగ్రత్తలు తీసుకోవాలని వైద్యసిబ్బంది సూచించారు. మండలంలోని పెద్దతాండ్రపాడ్‌లో శుక్రవారం సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పించారు. వర్షాలు కురుస్తున్నందున ప్రతి ఒక్కరూ ముందు జాగ్రత్తలు పాటించాలని కోరారు. ఇంటి పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవడంతోపాటు ఎక్కువ రోజులపాటు నీరు నిల్వ ఉండకుండా చూడాలన్నారు. ఆరోగ్య సంరక్షణ కోసం కాచిచల్లార్చిన నీటిని తాగాలని సూచించారు. డ్రెయినేజీల్లో ప్లాస్టిక్ వ్యర్థాలు వేయవద్దని కోరారు.అనంతరం పలువురికి వైద్యపరీక్షలు నిర్వహించి అవసరమైన మందులను అందజేశారు. కార్యక్రమంలో రామకృష్ణ, జయప్రకాష్, రంజిత్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ పార్టీలో చేరిక



కాంగ్రెస్ పార్టీలో చేరిన వారితో ఏఐసీసీ కార్యదర్శి సంపత్‌కుమార్

శాంతినగర్: అయిజ మండలం పులికల్‌కు చెందిన వాల్మీకి బోయలు శుక్రవారం ఏఐసీసీ కార్యదర్శి సంపత్‌కుమార్ సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. అయిజ మండల అధ్యక్షుడు జయన్న, పులికల్‌కు చెందిన బరికి దేవన్న ఆధ్వర్యంలో 60మంది కాంగ్రెస్ పార్టీలో చేరగా, ఏఐసీసీ కార్యదర్శి కండువా కప్పి ఆహ్వానించారు. కార్యక్రమంలో దొడ్డెప్ప, మహేష్, శంకర్‌గౌడ్ పాల్గొన్నారు.

అర్చకుడికి పరామర్శ

అలంపూర్ రూరల్: వారంరోజుల కిందట రోడ్డు ప్రమాదంలో గాయపడిన జోగుళాంబ, బాలబ్రహ్మేశ్వరస్వామి ఆలయాల ప్రధాన అర్చకుడు ఆనంద్‌శర్మను శుక్రవారం బీజేపీ జిల్లా అధ్యక్షుడు రాంచంద్రారెడ్డి పరామర్శించి ఆరోగ్య పరిస్థితిని తెలుసుకున్నారు. ఆయన వెంట బీజేపీ జిల్లా అధికార ప్రతినిధి రాజగోపాల్, నాగ మద్దిలేటి, జగన్మోహన్‌రెడ్డి, సంజీవరెడ్డి, నర్సింహులు, ఈశ్వర్, అశోక్, రాము, లక్ష్మణ్ ఉన్నారు.

వ్యక్తిగత శుభ్రత తప్పనిసరి

ఉండవెల్లి: ఆరోగ్య సంరక్షణ కోసం విద్యార్థినులు తప్పనిసరిగా వ్యక్తిగత శుభ్రత పాటించాలని మానవపాడు పీహెచ్‌సీ డాక్టర్ రిజ్వానా తస్వీర్ సూచించారు. మండలంలోని పుల్లూరు మహాత్మా జ్యోతిబాపూలే గురుకుల బాలికల పాఠశాలలో శుక్రవారం విద్యార్థినులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆరోగ్య సంరక్షణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. ప్రతి ఒక్కరూ పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ దేవానందం, చంద్రన్న పాల్గొన్నారు.



అవగాహన కల్పిస్తున్న డాక్టర్ రిజ్వానా తస్వీర్

నిలువ నీడ కరువు!

- బస్సు షెల్టర్లు లేక ప్రయాణికుల అవస్థలు
- బస్సుల కోసం రోడ్డుపైనే నిరీక్షణ
- పట్టించుకోని ప్రజాప్రతినిధులు, అధికారులు



మల్దకల్‌లో బస్సు కోసం రోడ్డుపై ఎదురుచూస్తున్న ప్రయాణికులు

మల్దకల్: పలు గ్రామాల స్టేజీల వద్ద ఆర్టీసీ ప్రయాణికులకు నిలువ నీడ కరువైంది. బస్సు షెల్టర్లు లేకపోవడంతో రోడ్డుపైనే నిరీక్షించాల్సిన పరిస్థితి నెలకొంది. ప్రయాణికులకు సౌకర్యాల కల్పనలో సంబంధిత అధికారులు, ప్రజాప్రతినిధులు విఫలమయ్యారన్న విమర్శలు వ్యక్తమవుతున్నాయి. గద్వాల–అయిజ ప్రధాన రహదారిలోని మల్దకల్, పెద్దపల్లి, బూడిదపాడు, అమరవాయి, శేషంపల్లి, తాటికుంట స్టేజీల నుంచి నిత్యం వందలాది మంది ప్రయాణికులు వివిధ ప్రాంతాలకు రాకపోకలు సాగిస్తుంటారు. ఆయా స్టేజీల వద్ద బస్సు షెల్టర్లు లేకపోవడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. ఆర్టీసీ అధికారులకు ఆదాయంపై ఉన్న శ్రద్ధ ప్రయాణికులకు సౌకర్యాలు కల్పించడంపై లేకుండాపోయిందని పలువురు విమర్శిస్తున్నారు. మండల కేంద్రంలో 10వేల మందికిపైగా జనాభా ఉండడంతోపాటు ప్రముఖ క్షేత్రంగా విరాజిల్లుతున్న మల్దకల్ తిమ్మప్పస్వామిని దర్శించుకునేందుకు వందలాది భక్తులు వస్తుంటారు. మండల కేంద్రంలో బస్టాండ్ కోసం కేటాయించిన స్థలంపై వివాదం నెలకొనడంతో నిర్మాణ పనులు చేపట్టలేదు. ఎన్నికల సమయంలో బస్టాండ్ నిర్మిస్తామని ప్రజాప్రతినిధులు హామీ ఇచ్చినా అమలుకు నోచుకోకపోవడంతో బస్టాండ్ కలగానే మారిందని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అదేవిధంగా ధరూరు, గట్టు, కేటీదొడ్డి, గద్వాల మండలాల్లోని వివిధ స్టేజీల వద్ద బస్సు షెల్టర్లు లేకపోవడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి బస్సు షెల్టర్ల నిర్మాణానికి చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

బస్టాండ్ నిర్మించాలి..



మండల కేంద్రంలో బస్టాండ్ లేకపోవడంతో ఇబ్బందులు పడుతున్నాం. ఇక్కడి నుంచి నిత్యం వందలాది మంది రాకపోకలు సాగిస్తుంటారు. ఆదిశిలా క్షేత్రానికి ప్రతి శనివారం వివిధ ప్రాంతాల నుంచి భక్తులు వస్తుంటారు. ఆర్టీసీ అధికారులు స్పందించి బస్టాండ్ నిర్మిస్తే ప్రయాణికులకు సౌకర్యవంతంగా ఉంటుంది. – రామాంజనేయులు, మల్దకల్

ఇబ్బందులు పడుతున్నాం..



బస్సు ఎప్పుడు వస్తుందో తెలియక రోడ్డుపై ఎదురు చూడాల్సిన పరిస్థితి ఉంది. బస్సు షెల్టర్ లేకపోవడంతో వానకు తడుస్తూ, ఎండకు ఎండుతున్నాం. అధికారులు స్పందించి అమరవాయి స్టేజీ వద్ద బస్సు షెల్టర్ నిర్మించి సమస్యను పరిష్కరించాలి. – తిమ్మన్న, అమరవాయి

చర్యలు తీసుకుంటాం..



ఆర్టీసీ గద్వాల డిపో పరిధిలోని పలు స్టేజీల వద్ద బస్సు షెల్టర్ల నిర్మాణానికి చర్యలు తీసుకుంటున్నాం. ఈ మేరకు ఉన్నతాధికారులకు నివేదిక సమర్పించాం. అధికారుల సూచన మేరకు ప్రయాణికుల సమస్యలను పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటాం. – మంజుల, ఆర్టీసీ డీఎం, గద్వాల

అధికసంఖ్యలో తరలిరావాలి

శాంతినగర్: ఈనెల 31న మహబూబ్‌నగర్‌లో నిర్వహించనున్న సమావేశానికి బీజేపీ నాయకులు, కార్యకర్తలు అధికసంఖ్యలో తరలివచ్చి విజయవంతం చేయాలని ఆ పార్టీ నియోజకవర్గ కన్వీనర్ మెడికల్ తిరుమల్‌రెడ్డి కోరారు. శాంతినగర్‌లోని పార్టీ కార్యాలయంలో శుక్రవారం మున్సిపాలిటీ అధ్యక్షుడు రామకృష్ణ అధ్యక్షతన నిర్వహించిన బీజేపీ నాయకుల సమావేశానికి తిరుమల్‌రెడ్డి హాజరై మాట్లాడారు. కేంద్ర మంత్రి, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రెడ్డి మొదటిసారి మహబూబ్‌నగర్‌కు వస్తున్నారని, అలంపూర్ నియోజకవర్గంలోని బీజేపీ నాయకులు, కార్యకర్తలు బూత్ కమిటీ సభ్యులు అధిక సంఖ్యలో తరలిరావాలని పిలుపునిచ్చారు. సమావేశంలో జిల్లా ప్రధాన కార్యదర్శి జలగరి అశోక్, ఎస్సీ మోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు మాధన్న, జిల్లా అధికార ప్రతినిధి రాజగోపాల్ తదితరులు ఉన్నారు.



మాట్లాడుతున్న అశోక్

బహుజన సమాజ్ పార్టీని ఆదరించండి



జల్లాపురంలో మాట్లాడుతున్న ఎంసీ కేశవ

మానవపాడు: అలంపూర్ నియోజకవర్గ ప్రజలు బహుజన సమాజ్ పార్టీని ఆదరించాలని జిల్లా అధ్యక్షుడు ఎంసీ కేశవ్ కోరారు. మండలంలోని పల్లెపాడు, చండూరు, నారాయణపురం, పెద్ద ఆముదాలపాడు, అమరవాయి, మానవపాడు, జల్లాపురం గ్రామాల్లో శుక్రవారం పర్యటించి సమస్యలను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బహుజన రాజ్యాధికార యాత్రలో భాగంగా ఆర్‌ఎస్ ప్రవీణ్‌కుమార్ ఆగస్టు 1న చండూరు, పల్లెపాడు, నారాయణపురం, 2న మానవపాడు, అమరవాయి, పెద్ద ఆముదాలపాడు గ్రామాల్లో పర్యటిస్తారని తెలిపారు. యాత్రలో పార్టీ నాయకులు, కార్యకర్తలు, ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో తిరుపాల్, వెంకటేశ్వర్లు, రాంప్రసాద్‌రెడ్డి, లక్ష్మయ్య, హనోక్ పాల్గొన్నారు.

గ్రామాల్లో తాగునీటి కష్టాలు

మానవపాడు: మండలంలోని ఏ.బుర్దిపాడు, మద్దూరు, గోకులపాడు, కొర్విపాడు, కలుకుంట్ల, చిన్నపోతులపాడు, పెద్దపోతులపాడు, చంద్రశేఖర్‌నగర్ తదితర గ్రామాల్లో తాగునీటి సమస్యతో ప్రజలు సతమతమవుతున్నారు. మిషన్ భగీరథ పథకం నీటి సరఫరాలో అంతరాయం ఏర్పడడం.. సంబంధిత అధికారులు ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయకపోవడంతో బిందెడు నీటి కోసం అష్టకష్టాలు పడుతున్నారు. బోరుబావుల నుంచి ద్విచక్ర వాహనాలు, సైకిళ్లు, ఎద్దులబండ్లపై నీటిని తెచ్చుకుంటున్నారు. అధికారులు స్పందించి తాగునీటి సమస్యను పరిష్కరించాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.



చెన్నిపాడులో బోరుబావి వద్ద నీటిని పట్టుకుంటున్న గ్రామస్తులు

వాసవీమాతకు ప్రత్యేక పూజలు



వాసవీమాతకు పూజలు చేస్తున్న భక్తులు

అయిజ: అధిక శ్రావణమాసాన్ని పురస్కరించుకొని శుక్రవారం మండల కేంద్రంలోని వాసవీ కన్యకా పరమేశ్వరి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. వాసవీమాతకు క్షీరాభిషేకం నిర్వహించి మణిద్వీప వర్ణనపూజ చేశారు. అమ్మవారికి సారె పెట్టి మహా మంగళహారతి సమర్పించారు. ఈ సందర్భంగా భక్తులతో ఆలయం కిటకిటలాడింది. అమ్మవారి నామస్మరణ మార్మోగింది. ఆలయ నిర్వాహకులు భక్తులకు తీర్థ ప్రసాదాలను పంపిణీ చేశారు.



శ్రీశైలం వైపు కృష్ణమ్మ పరుగులు పెడుతోంది. జూరాల నుంచి నీటిని దిగువకు విడుదల చేస్తుండడంతో ఇటిక్యాల మండలంలోని బీచుపల్లి బ్రిడ్జి వద్ద కృష్ణమ్మ నిండుకుండలా దర్శనమిస్తోంది. – ఎర్రవల్లిచౌరస్తా

కూలిన మట్టి మిద్దెలు

గట్టు: మండల కేంద్రంలోని తెలుగు వీధిలో శుక్రవారం సోంపురం రాముడు, చిన్న మల్లేష్ మట్టి ఇళ్ల పైకప్పులు కూలిపోయాయి. కొన్ని రోజులుగా కురుస్తున్న వర్షాలకు బాగా తడిసిన మట్టి మిద్దెలు కుప్పకూలాయి. ఇంట్లో నివసిస్తున్న వారు బయటకు పరిగెత్తి ప్రాణాలను కాపాడుకున్నారు. చిన్న మల్లేష్‌కు చెందిన ఒక పొట్టేలుపై మట్టిదిబ్బలు పడడంతో మృతి చెందింది. పొట్టేలు విలువ రూ.18వేల వరకు ఉంటుందని బాధితుడు వాపోయాడు. వర్షాలు నిలిచిపోగా.. రైతులు, కూలీలు వ్యవసాయ పనులకు సిద్ధమవుతున్న తరుణంలో మట్టి ఇళ్లు కూలిపోవడంతో కాలనీవాసులు ఆందోళనకు గురయ్యారు. బాధిత కుటుంబాలను ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు.



కూలిన మట్టి ఇళ్లు

వైభవంగా మొహర్రం ఉత్సవాలు

అలంపూర్ రూరల్: మండలంలోని గ్రామాల్లో మొహర్రం ఉత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. శుక్రవారం పట్టణంలోని గంధం, పెద్ద లాలీసాబ్, భైరంపల్లి లాలీసాబ్ పీర్ల సవారికి బయలుదేరాయి.

ఎర్రవల్లిచౌరస్తా: ఇటిక్యాల మండలంలోని పలు గ్రామాల్లో మొహర్రం ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. ఆర్.గార్లపాడులో మద్దెలబండ ఉస్సేన్‌సాబ్ పీరును భక్తులు దర్శించుకొని మొక్కులు చెల్లించుకున్నారు.

అభివృద్ధికి ఆకర్షితులై..

గద్వాల రూరల్: రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలకు ఆకర్షితులై ఇతర పార్టీల నాయకులు, కార్యకర్తలు బీఆర్‌ఎస్‌లో చేరుతున్నట్లు ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి అన్నారు. కేటీదొడ్డి మండలం సుల్తానాపురం గ్రామానికి చెందిన గౌడ కులస్తులు శుక్రవారం ఎమ్మెల్యే బండ్ల సమక్షంలో బీఆర్‌ఎస్‌లో చేరారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ శ్రీధర్‌గౌడ్, రాష్ట్ర వినియోగదారుల ఫోరం చైర్మన్ గట్టు తిమ్మప్ప, జెడ్పీటీసీ రాజశేఖర్ పాల్గొన్నారు.